# కౌగిలింపడవ

మధ్యాహ్నం వేళ మబ్బు పట్టడం మీనాక్షికి భయం కలిగించింది. అయోమయంగా ఆకాశం వంక చూసింది. పూర్తిగా నల్లని మేఘాలతో నిండిపోయి ఎండ వేడిమితో పాటు వెచ్చని వెలుగును కూడా దోచుకుంటూ చీకట్లు కమ్ముకొస్తున్నట్టుగా అనిపించింది.

అలానే చూస్తున్న ఆమెను ఉలికిపడేట్టు చేసింది ఒక ఉరుము. వెంటనే మెరుపు కాంతి మీనాక్షి కళ్లను జిగేలనిపించింది. మెరుపంటే ప్రసాదుకు చాలా ఇష్టం. "నీ పేరు విద్యుల్లత అయితే బాగుండేది మీనా. పోనీ అలానే పిలవనా ?" అనేవాడు. "నాకు ఇప్పటి నా పేరంటేనే ఇష్టమండి. తొందరలో ఓ చక్కని అమ్మాయిని కని

మీకు బహుమతిగా ఇచ్చేస్తాలెండి. పాపకి ఆ పేరు పెట్టి మీ కోరిక తీర్చేసుకుందురుగాని సరేనా?" అనేది తను.

గతంలోని ఈ సంఘటన వింతగా గుర్తుకు తెచ్చింది మీనాక్షికి ఆ మెరుపు. నిజంగా ఆ దంపతుల జీవితాలలో విద్యుల్లత ఐదేళ్లుగా వెలలేని కాంతులు వెదజల్లుతోంది. మీనాక్షి గతం తీపి అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆలోచనలో మునిగింది. అలా ఎంత సేపుందో తెలియదు. కొంత సేపటికి కంగారుగా గడియారం చూసింది. చిన్న ముల్లు మూడు దాటింది. పెద్ద ముల్లు పది మీదకొచ్చింది. "అమ్మో అప్పుడే నాలుగు కావస్తోంది. స్కూలు విడిచిపెట్టేస్తారు. పాప ఈ వానలో తడిసిపోతుందో ఏమో!" అనుకుంది.

మీనాక్షి గుండెలు దడదడలాడేయి. అసలే నాలుగు రోజులు జ్వరం వచ్చి తగ్గింది.

నిన్ననే కాస్త చారు అన్నం తింది. ఇవేళ మళ్ళా ఈ పాడు వర్షం తడిపేస్తే పాపాయికి ఏమవుతుందో? ఏమో? ఇంత నిద్ర ఎలా పట్టేసిందో? లేకపోతే చినుకు చినుకూ మొదలయ్యేసరికే తను గొడుగు వేసుకుని స్కూలుకు వెళ్ళి విద్యూని ఎత్తుకొచ్చేయదూ? ఈపాటికి ఎలా అయినా సగం దూరం వచ్చేసి వుంట్టుంది. మీనాక్షి ఆలోచిస్తూ వుండగానే పక్కింటివాళ్ళ అబ్బాయి విద్యుల్లతని తన గొడుగులో తీసుకొచ్చేసేడు. ఆ తల్లి మనస్సు తేలికపడింది. డబ్బాలో నుంచి రెండు చాక్లెట్లు తీసి ఆ అబ్బాయికి ఇచ్చింది.

"వస్తా! ఆంటీ!" అంటూ వెళ్ళిపోయాడు ఆ పిల్లవాడు.

పుస్తకాల సంచి ప్రక్కన పడేసి మీనాక్షి దగ్గరకు వచ్చి గారాలు పోయింది విద్యుల్లత. ముద్దులతో మనస్సు నింపి, పాలు, ఫలహారాలతో పాపాయి కడుపు నింపింది మీనాక్షి. సమయం

గడిచిపోతున్నదే కాని, వర్షం తగ్గే సూచనలు కనిపించడం లేదు. మీనాక్షికి చిరాగ్గా వుంది. తను ఈ రోజు మహిళా మండలికి వెళ్లాలని అనుకుంది. బజారుకి వెళ్ళి పండగ బట్టలు తెచ్చేసుకోవాలి అనుకుంది. అన్నిటికీ అడ్డుగా ఈ పాడు వర్షం ఒకటి. పొయ్యి క్రిందకు, పొయ్యి మీదకు వుంటే వర్షాకాలం అంత హాయిలేదని అంటారే కాని ఈ వర్షంలో వెయ్యి తిప్పలు అనుకుంటూ వంట పనిలో మునిగిపోయింది. "విద్యా ఆడుకోవడానికి అవతలికి వెళ్ళొద్దు. తడిసిపోతావమ్మా, నా బంగారు తల్లి కదూ. నీకు బోలెడు బొమ్మలు వున్నాయిగా. ఇంట్లోనే ఆడుకో" వంటింట్లోనుంచే బిగ్గరగా అంది కానీ విద్యుల్లతకి రోజూ ఆడుకుంటున్న ఆ బొమ్మలతో ఆడుకోవాలి అని అనిపించ లేదు. ఎంచక్కా కాగితంతో పడవ చేసి వాననీళ్లలో వదలి ఆడాలి. ఇందాక స్కూలు నుంచి తీసుకువస్తూ రాము చెప్పేడు, తను కాగితాలతో రకరకాల పడవలు చేయగలనని. వాళ్లంతా పడవలు చేసుకుని ఆడుతూనే వుండివుంటారు. ఆ ఊహ రాగానే అమ్మ మాట పెడచెవిన పెట్టి టేబులు పైన కాగితం తీసుకుని వీథిలోకి పరి గెత్తింది.

క్షణంలో పడవలతో ఆడుకుంటున్న పదిమంది పిల్లల్లో తనూ ఒకటైంది. "రామూ, ఎంత మంచి కాగితం తెచ్చానో చూడు! ఈ బొమ్మ పైకి కన్పించేలా నాకూ పడవ చేసి ఇవ్వవూ?" అంది.

తన పడవ నీళ్లలో వదలి గంతులేసింది. "అబ్బా ఎంత మంచి పడవో చూడండర్రా! మనందరి కన్నా విద్యా పడవే ఫస్టు"

"విద్యా! ఎంత ఠీవిగా వెళ్ళిపోతోందే నీటిలో నీ పడవ!"

"ఔను, అంత దూరం నుంచి కూడా ఎంత అందంగా వుందో! అలా తోటి పిల్లలు తన పడవను మెచ్చుకుంటూ వుంటే ఆనందంతో

మెరిశాయి ఆ చిన్నారి కళ్ళు. తన అందాల పడవను అమ్మకు చూపిస్తే....

అయ్యో! నీళ్లలో మునిగిపోతుందేమో! పాడైపోతే అమ్మకి చూపించడమెలా ? ఈ ఊహ రాగానే ఆ నీటిలో నుండి పరుగులా నడవడం ప్రారంభించింది.

తక్షణ పిల్లలంతా 'వద్దు వదిలేయ్ నీ గౌను పాడవుతుంది' రకరకాలుగా కేకలేస్తున్నారు.

"ఒక్క క్షణంలో ప్రమాదం తప్పింది. వాన నీటిలో ఆ పరుగు లేటమ్మా? అటు కేసి కాలవలో పడితే?" దారిన పోయే దానయ్య రెక్క పట్టుకు లాగి ఇంటి వాకిట్లోకి తెచ్చాడు. చేతిలో వుండలా నలిగిన పడవ తడిసిపోయి, మురికి పట్టిన గౌనుతో తన పడవను నెమ్మదిగా విప్పుకుంటూ ఇల్లు చేరింది విద్యుల్లత.

"అయ్యయ్యో! వద్దంటూంటే ఎక్కడి కెళ్లావే? ఆ గౌను అలా తడిసిపోయిందే?" గౌను విప్పుతూ ఆప్యాయంగా అంటున్న తల్లితో "అమ్మా నా పడవ! మెల్లిగా విప్పవూ! చినుగులు పట్టి నలిగిన పడవ కాగితం తల్లి చేతిలో వుంచింది విద్యుల్లత.

ఆమెలోని అప్యాయత ఒక్కసారి ఆవేశంగా మారింది. తన ప్రాణానికి ప్రాణమైన విద్యుల్లతపై ఆమె చేతులు విసురుగా పడు తున్నాయి. అమ్మ ఎప్పుడూ తనను కొట్టదు. ఒక్కసారిగా ఇంతలా బాదేస్తుంటే ఓర్చుకోలేక బిగ్గరగా ఏడవసాగింది.

"చాలు తల్లీ ! చేసినపని చాలక ఇంకా ఏడుపు కూడానా?" ఆమె చేతులు ఇంకా విద్యుల్లత వీపు మీద తాండవం చేస్తున్నాయి. తను చేసిన తప్పేమిటో, అమ్మ ఎందుకు అలా కొట్టేస్తోందో అర్థం కాలేదు ఆ పసి హృదయానికి. భయంతో గుక్కిళ్ళు మింగుతోంది.

ఎంతసేపు అలా కొట్టిందో మీనాక్షికే తెలియదు. ఆమెలోని ఆవేశం ఒక పట్టాన చల్లారలేదు. "పాడు పిల్ల ఎంతపని చేసింది!" అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

వెక్కి వెక్కి ఏడుస్తూ ఒక మూల పడుకుంది విద్యుల్లత.

విద్యుల్లతను లేపి విసుగ్గా అన్నం తినిపించింది. తిన్నదంతా ఆ పాప వాంతిచేసుకున్నా, మీనాక్షికి అదేం పట్టలేదు.

"ఇప్పుడెలా కమలకి ముఖం చూపించడం? విషయం ఆమెకు ఎలా చెప్పడం?" ఆ ఆలోచనే మీనాక్షి మనసును దొలిచిస్తోంది. ఈ సారి పండుగ గౌను మీద మంచి డిజైను వెయ్యాలని ముచ్చటపడి కమలని అడిగి తెచ్చింది ఆకాగితం. అదివ్వడానికి కమల ఎంత బాధపడిందని? అది ఫారిన్ డిజైనని, డ్రేసు తీసుకుని వెంటనే యిచ్చెయ్యమని మరీ మరీ చెప్పింది. బిడ్డపైన మమతను వెనక్కు నెట్టేసి ఆ స్థానాన్ని ఆక్రమించుకుంది మీనాక్షి మనస్సులో ఆ కాగితం. నలిగిన ఆ కాగితపు పడవ చూస్తున్నకొద్దీ విద్యుల్లత మీద ఒళ్లుమండుకొచ్చింది మీనాక్షికి. ఆ రాత్రి విద్యుకి బాగా జ్వరం వచ్చింది. ఒకటే కలవరింతలు. అమ్మా! కొట్టకు. ఇంకెప్పుడూ కాగితపు పడవలతో ఆడుకోను అంటూ. అప్పటికి మీనాక్షికి కొద్దిగా భయంకలిగింది. తను కొట్టడం వలనే పాపకి మళ్ళీ జ్వరంవచ్చింది. దగ్గరకు తీసుకుంది. జ్వరంతో కాలిపోతోంది పాప ఒళ్లు. తను ఎంత తొందరపడింది. అనాలోచితంగా పసిదాన్ని బాదేసి భయ పెట్టింది. దాని లేత మనస్సు ఎంత బెదిరిపోయింది. తను పాపని ఎంతకొట్టినా డిజైనుకాగితం వస్తుందా? ఎలాగూ కమలకి క్షమాపణ చెప్పి బ్రతిమాలుకోక తప్పదు. ఆమె ఏమన్నా తనుబదులు చెప్ప కుండా వుండవలసిందే. అనవసరంగా తను ఎంత పని చేసింది!

తనలో మాతృప్రేమ ఎక్కడికి ఎగిరిపోయింది? మీనాక్షి మనస్సు యిరవై యేళ్ళ గతంలో జారిపోయింది.

అప్పుడు తనకి ఏడెనిమిదేళ్ళు వర్షంలో కాగితపు పడవలు వేసి ఆడుకోవడం చాలా సరదాగా వుండేది. ఎక్కడెక్కడి కాగితాలూ ఏరుకొచ్చి పడవలు చేసి ఆటలాడేది. ఆ తెలిసీ తెలియని వయస్సులోనే తను ఈ కాగితపు పడవల సరదాకోసమే నాన్నారి ఆఫీసు టేబుల్ పైనుంచి నాలుగు కాగితాలు తీసి పడవలు చేసుకుని వర్షంలో ఎంతో హుషారుగా ఆడుకుంది. ఆ కాగితాలు నాన్నారికెంత ముఖ్యమో, వాటిని పాడుచేయడం వలన ఎంత నష్టమో అప్పుడు తనకి తెలియదు. తను ఆ కాగితాలు చించేయడం వలన అప్పట్లో నాన్నారికి రావలసిన ప్రమోషన్ ఆగిపోయిందని, ఆఫీసర్ చేత నాన్నారు ఎన్నో చీవాట్లుతిన్నారని, పెద్దయ్యాకనే తనకు తెలిసింది. కాస్త చిరాకు పడడం, కళ్ళెర్రచేయడం తప్ప తనను మరేమీ అనలేదు నాన్నారు. "కాగితాల పడవకోసం కాగితాలు నీకు కావాలంటే నన్నడుగు తల్లీ! ఇలా ఎప్పుడూ టేబిల్ పై నుండి తీయకు" అంతే,

మరి ఇప్పుడు విద్యా అదే పొరపాటు చేస్తే తను నాన్నారి సహనంలో అణుమాత్రం కూడా చూపించలేకపోయిందేం? నిట్టూర్చింది మీనాక్షి.

స్త్రీని సహన మూర్తి అంటారు. మరి తను చేసిందేమిటి? అనాలోచితంగా పసిపిల్లల పైన విసుక్కోవడం, మాటి మాటికి చేయి చేసుకోవడం, మానలేనంత వరకూ 'స్త్రీ సహనమూర్తి' అనే పదానికి అర్థాలు కాదేమో అనుకుంది మీనాక్షి, విద్యుల్లతను ప్రేమగా గుండెకు హత్తుకుంటూ.